MB01 P151 c

T. T. D. Religious Publication Series No. 4

# వేదములు

రచయిత :

ఆర్ష విద్యాలంకార

శ్రీ కల్లూరి చంద్రమౌళి.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్. గారిచే

ప్రకటింపబడినది.

1980

**Subsidised Price : 0—50 Paise only.**

CI

పెద్దవారిశక్తి చేటునకే కారణము

మూర్ఖత సకల వినాశకరము

ఇతరులను పరిహసింపరాదు

గొప్పవారితో స్పర్థపడరాదు

దీర్ఘవైరము కలవానికి కోపము కలిగింపరాదు

కృతఘ్నత మహాదోషము

కోపము కలవారితో సంబంధము అనర్థదాయకము

ఆపదలో ఆదుకొన్నవాడే ఆప్తుడు

తల్లిదండ్రులు, గురుదైవసమానులు

అన్నము పరమాత్మస్వరూపము; దానిని నిర్లక్ష్యము చేయరాదు

విద్యవలన వినయము, వినయమువలన పాత్రత, దానివలన మానవుడు ఇహపరసుఖములు పొందగలడు.

MB01P157 ೧

# వేదములు

H:-7.2
W:-5.1

రచయిత:

ఆర్ష విద్యాలంకార

శ్రీ కల్లూరి చంద్రమౌళి

తిరుమల తిరుపతి దేవస్థానముల ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ పి. వి. ఆర్. కె. ప్రసాద్, ఐ. ఏ. ఎస్. గారిచే

ప్రకటింపబడినది.

1980

VEDAMULU

తృతీయ ముద్రణము
10,000 కాపీలు

తిరుమల తిరుపతి దేవస్థానముల
ముద్రణాలయము, తిరుపతి.

# "దివ్యవాణి"

* *

వేదములు పరమేశ్వర ప్రోక్తములు. ప్రజ్ఞాన నిలయములు. తిరుమల తిరుపతిలో పరమాత్మ స్వరూపములైన చతుర్వేదములు సర్వదా గానము సలుపబడుచుండుట సదాచారము, స్తవనీయము.

వేదమంత్రముల హృదయము అంతర్లీనముగనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి యాకృతితో - గ్రంథ రూపమున వెలువడుటయు సహజము. ఇట్టి పవిత్రాశయముతో "వేదములు" అనెడి యీ గ్రంథము - భారతీయ తత్త్వచింతనాపరులకు — వేదస్వరూప జిజ్ఞాసువులకు తిరుమల తిరుపతి పాలకసంఘమువారిచే సమర్పింపబడు ;

దివ్యవాణి

# "నిగమజిజ్ఞాస"

* * *

వేద పద పరమార్థమునకు సంబంధించిన సమీక్షయు; వేదాంగముల నిర్ణయమునకు జెందిన మీమాంసయు; నేటిది గాదు. యుగ యుగములనుండి విజ్ఞతా బలపరిపూర్ణులగు కోవిదులు పలుపురీయంశములను భిన్నభంగిమలలో పరిశీలన మొనరించి విభిన్న సిద్ధాంతముల నేర్పరించుచునే యుండిరి.

ఈశ్వరప్రోక్తమగు వేదవాణి; మానవ జ్ఞాన విజ్ఞాన సంధాన చాతురీ ధురంధరత గలది. సర్వము నవగాహనమునకు దెప్పింప గలదియే వేదము. విశదీకరణమున వైవిధ్యమున్నను విస్పష్టముగ ప్రతి వ్యాఖ్యాతయు నీ యాథార్థ్యమును వెల్లడింపక తప్పదు.

"సత్యార్థ ప్రతిపాదకములు. సర్వశంకా నివారకములు, సకల ప్రాణ్యుద్ధారకములు" అగు వేదముల మహాత్మ్యమువట్ల కర్మ భూమియగు భారతదేశములలో గల ప్రగాఢ విశ్వాస మిట్టిది.

జీవన లీలాలోలుపత గల నరనారీగణముల మనుగడకు సృష్ట్యాదినుండియు నికషోపలమై - అకళంక ప్రవర్తను దీర్చిదిద్ది మానవతకే వన్నెలు చిన్నెలు గూర్చి దివ్యత్వము నందింపగల వేద వాఙ్మయము భారతీయ జనజీవనలహరిలో గలసి ప్రవహించినది.

అందువలన వేదధర్మములు మానవ జీవిత రీతులలో విభజింప వీలుపడని విషయములై నిల్చినవి. అవి ప్రభుశాసన తుల్యములే యగుగాక. మమతతో మనుజసంతతి వాని నౌదల వహించినది. అనురక్తితో నాచరణమునం దిడుకొని అమోఘ ఫలముల నందుకొన్నది.

ఈ బహిరంగ సత్యము ప్రతి యుగమున ప్రతి తరమున నిత్య నూతన శోభా ప్రాభవములతో ప్రాజ్ఞులనోట ప్రతిధ్వనించినది. మహర్షులు, పండితులు, మహనీయులు నగు వారి ప్రబల పరిశోధనములతో ప్రచండ తర్కములలో సత్యాంశములతో బాటుగ కొన్ని అవాస్తవిక భావనలు సైతము బహిర్గతమగుట జిజ్ఞాసువులలో నొక విధమగు మథనము రేకొల్పినది.

దృక్పథములలో గల విభిన్నత భిన్నవ్యాఖ్యలకు దారిదీసినది. శ్రుతులకు స్మృతులకు గల తారతమ్యమును నిపుణముగ బరిశీలించిన గదా సత్య మెఱుకపడునది? ఈశ్వర ప్రోక్తములు శ్రుతులు. ఋషి ప్రోక్తములు బ్రాహ్మణములు; కాగా వ్యాఖ్యాన సమన్విత వేదమంత్ర జాలము నంతయు వేదముగ బరిగణించెడి "అపోహ" యొకటి ప్రచార రంగమున కెక్కినది. అట్టితరి దైవీవాక్కుల అప్రతి హతశక్తి యేదో యిదమిత్థమనియెట్లు నిర్ణయము జరుపగలరు? కాలక్రమమున పరమేశ్వర ప్రోక్తములగు వేదముల సత్యస్వరూపమునకే సందిగ్ధత యేర్పడుటకిది చక్కని రహదారి కాగలదు గదా!

ఈదృక్పథముతో వేదముల యునికిని గూర్చి చెలరేగిన భిన్న వాదములపై యొక సరల సమగ్ర సమీక్షయొనరింప "వేదములు" అనెడి గ్రంథము సంగ్రథన మొనర్పబడినది. రచయిత శ్రీ కల్లూరి చంద్రమౌళిగారు - ప్రాచీన సంస్కృతీ సారస్వతముల లోతుపాతుల నామూలముగ గ్రహింప నిరంతర మథన మొనరించుచున్న నిశ్చల విద్యా పిపాసువులు. ఆయన యీ గ్రంథమున "వేదములనగానేవి?" అని ప్రశ్నించుకొని ఋవి యగును. తదన్యములు గావేరవని నిర్ధారణ సల్పుటకై యుదాహరించిన వేదమంత్రములను; స్మృతిసూక్తులను

గమనించినచో వేదవాఙ్మయమున వారికిగల ప్రవేశపరిశీలనాత్మక బల మెంతయో వ్యక్తముగాగలదు. ఏవి యేల వేద మంత్రములైనవి? ఏవి యేల బ్రాహ్మణములైనవి? యనెడి విషయమును సిద్ధాంతీకరించుటకై శ్రీ చంద్రమౌళిగారు జరిపిన పరిశోధనాత్మక ప్రముఖకృషి విద్వజ్జ నాదరణ పాత్రముగా వెలుగొంద గలదనుట కీగ్రంథమొక సాక్ష్యమన వచ్చును.

"సత్యము ననుభవమునకు దెచ్చుకొని తత్ఫలితమనుభవిం చుటయే ప్రతిమానవుని జీవిత పరమలక్ష్యము" "రాగద్వేషములకు లోను గాక పరిశీలనజేసి – పరిశోధనగావించి – హేతుబద్ధముగ తర్కించి సత్యమును నిర్ణయించి నిర్భయముగ నిష్కామముగ బ్రకటింతము." "వేదముల నిజ స్వరూపమును గూర్చి —— —— హేతుబద్ధములైన వాస్తవిక విషయములను హృదయ పూర్వకముగ నామోదింతము. అహే తుకములు; అసత్యములునగు వానిని నిరాతంకముగ నిరాకరింతము– పెద్దఱికమును కించపఱచుట, అవహేళన మొనర్చుట—— మా భావము గాదు." "శ్రద్ధాసక్తులతో యథాతథముగ సత్యమును నిరూపించుటయే మా ఆకాంక్ష" "సహృదయులు మా నిర్ణయములను సైతము సహే తుకముగ దర్కింపవచ్చును." "సత్యమును అందరము ఏకగ్రీవముగ నామోదించి కీర్తింతము. ఏకముగ ననుభవింతము."

ఈ గ్రంథరచనలో రచయిత యాశయములివ్వి. సత్యజిజ్ఞాసతో బాటుగ నిందు సాహసాత్మక ప్రతిజ్ఞయు నువ్యక్తమగుట లేదా!


రచయిత నిపుణమతియై నిశిత పరిశీలనముతో నిర్ధారణ సల్పిన యంశమును రాగద్వేషములకు లోనుగాక ప్రకటింతుననుటయు – అట్లు ప్రకటించుటయు నొక సాహసమే కాగలదనుకొందును.

వేదాధ్యయనమును గూర్చి వ్రాయుచు వారు పేర్కొన్న కొన్ని వివరణలు కడుంగడు రమ్యములు. పురుషసూక్తమునగల విరాట్పురుషుని స్వరూప వర్ణనమునకు రచయిత యిచ్చిన వ్యాఖ్య సత్యసమ్మతమైనట్టిది. సర్వజన సమైక్య సంసూచకమైనట్టిది. జన్మమునుబట్టి కాక గుణకర్మలను బట్టియే వర్ణవిభాగ మాదినుండియు నిర్ణయింపబడుచున్న దనుటకు వారు చూపిన నిదర్శనములు కాదనుటకు వీలుగానివి. ఇట్లు సత్యజిజ్ఞాసతో; సమైక్యధోరణితో; సహకార వైఖరితో జనులు మనుగడను సాగించి సఫలతను సార్థకతను గడింపవలె ననెడి దివ్యాశయమును వా రిందు ప్రత్యక్షర బద్ధమొనర్చిరి. వేదామృత పానమున మానవులకట్టి మనోబలము, హృదయ వికాసము సమకూరగలదని ప్రబోధించిరి. ఇట్టి ప్రబోధము జాతికి క్షేమకరము. వేదసంపదపై భక్తి ప్రపత్తి భరితానురాగము సర్వత్ర పెంపుగాంచవలెను. నాడే జనగణమంగళ గీతికలు వినిపించుచున్నది. ఈ మంగళ గీతికలు తిరుమల తిరుపతి దేవాలయ పాలకవర్గ భావములలో వెలువడుట స్తవనీయము. శ్రీనివాసమూర్తి నిలయము – వేద భక్తి ధర్మప్రబోధ పీఠమై, సర్వదా రహించి, మంజుల గానముల వెలయించి మానవ మానస కాసారముల బునీతము గావించుగాక

ఆర్షసంస్కృతి వైభవమునకు–భారతీయ ధర్మచింతన తత్పరతకు–తిరుమల తిరుపతి దేవస్థానపాలక సంఘమువారు ప్రచురించెడి వేద ధర్మభక్తిసాహిత్య సంపుటములు ప్రతిబింబములై ప్రతిఫలించు గాక.

సత్తెనపల్లి
2-5-78

డాక్టర్ రత్నాకరం
శ్రీనివాసాచార్యులు.



# వే ద ము లు

వేదములనగా — ఈశ్వరప్రోక్త వాణి. సర్వవిజ్ఞానమును మానవుని ఎఱుకకుదెచ్చు దైవీ వాక్కు. 'విద్యతే - లభ్యతే జ్ఞానమ్ - అనేన ఇతి వేదః' దేనివలన జ్ఞానమును పొందగలమో అదియే వేదము. దేనివలన సర్వలోకములు తమ యునికి మనుకులు గలిగియుండునో ఆ సత్పదార్థమే ఆ ప్రజ్ఞానమే; వేదము.

'వేత్తీతి, వేదయతీతి వేదః'. ఇది జ్ఞానవాచకము. దేనివలన సర్వము నెఱుంగుదుమో, ఏది సర్వమును ఎఱుకవఱచునో అది వేదము. 'విందత్యనేనేతి వేదః' సర్వమును దెలియజెప్పునది వేదము. దేనివలన మానవులు సర్వము నెఱుంగుచున్నారో అది వేదము.

'విన్దతి లభతే ఇతి వేదః' దేనివలన మానవులు అభ్యుదయ నిశ్శ్రేయసములను పొందగలుగుదురో అది వేదము. 'విన్దతి అనేవ ధర్మం ఇతి వేదః' సర్వధర్మములను ఎఱుకవఱచునది వేదము. "సర్వోప్యయం వేదః ప్రత్యక్షానుమానాభ్యాం. అనవగతేష్టానిష్టప్రాప్తి పరిహారోపాయ ప్రకాశన పరః; సర్వపురుషాణాం నిసర్గత ఏవ తత్ప్రాప్తి పరిహారయో రిష్టత్వాత్" అని శంకరాచార్యులు. ప్రత్యక్షాను మానప్రమాణములకు దెలియబడని, ఇష్టప్రాప్తికి అనిష్ట పరిహారమునకు తగిన సాధనములను తెలియజేయునదియే - వేదమని నిర్ణయము. సర్వ మానవులకు ఇష్టప్రాప్తి అనిష్ట పరిహారము సహజమైన కోరికలు గదా!

వేదములు ప్రత్యక్షప్రమాణమునకు గోచరములగు విషయములను, అనుమాన ప్రమాణమునకు గమ్యములగు విషయములను తెలుపుటయే

గాక, కేవల ప్రత్యక్షానుమానములకు గోచరములుగాని, అనుభూతి విశేషములనుగూడ దెలియజేయును.

వేదములు - సత్యార్థ ప్రతిపాదకములు; సర్వశంకానివారకములు, సర్వప్రాణ్యుద్ధారకములు. కావుననే 'వేదములు' దైవవాక్కులు — భగవన్నిశ్శ్వాసములు - అనంతములు ప్రజ్ఞాననిలయములు - అపౌరుషేయములు - పరిపూర్ణములు - నిత్యసత్యములు' అని భారతీయులు హృదయపూర్వకముగ భక్తిప్రపత్తులతో విశ్వసించి, సర్వ విజ్ఞానమునకును పరమ ప్రమాణములుగ వాని నామోదించిరి. 'వేదములు నాలుగు. అవి సనాతనములు. అపౌరుషేయములు. నిత్యసత్యములు.' అని యుగయుగములుగ భారతీయార్యులు విశ్వసించిరి. అట్టి దృఢ విశ్వాసమే నాటికి నేటికిని భారతీయులలో ననుస్యూతముగ వ్యక్తమగుచున్నది.

'వేదములు సర్వకాలసర్వావస్థలయందును, సర్వప్రాంతములలో సకల మానవులకును సమాన ఫలములనే సమకూర్చును. సర్వజ్ఞుడు, సర్వవ్యాపకుడు, నిత్యుడునగు భగవంతుని జ్ఞానముగావున, వేదములు విశ్వవ్యాప్తములు. సత్యము ననుభవమునకు దెచ్చుకొని తత్ఫలిత మనుభవించుటయే ప్రతిమానవుని జీవితపరమలక్ష్యము. నిత్యానందము ననుభవించుటకు ధారణాశక్తి - తపస్సు - అత్యావశ్యకములు.' అని తపోనిష్ఠాగరిష్ఠులైన మహర్షులుద్ఘాటించుచునేయుండిరి.

ఋషి యనగా మంత్ర ద్రష్ట. ఆతడు మంత్రములకు కర్త మాత్రముగాడు. వేదమంత్రముల ననుభూతికి దెచ్చుకొని వాని రూప

మును తాము ప్రత్యక్షముగగాంచి పరులకు జూపనేర్చి ప్రకటింపగలిగిన మహాత్ములే ఋషులు. మహర్షులు సత్యమును భిన్నదృక్పథములలో గాంచిరి. భిన్నరీతులలో ప్రబోధించి వ్యక్తీకరించిరి. సత్యస్వరూప మగు బ్రహ్మమును బ్రత్యక్ష మొనర్చుకొనిరి. అమృత జలధిలొ మునిగి ఆనంద రసమును గ్రోలిరి.

భిన్నమార్గములలో బయనించుచు, తమ తమ యనుభవము లను భిన్నరీతులలో ప్రకటించిరి. కావుననే వేదమంత్రములకు భిన్న వ్యాఖ్యలు వెలువడినవి. అవియే గ్రంథరూపములైనవి. వానినే బ్రాహ్మణము లందురు. వేదమంత్రములు గ్రంథములు గావు. అవి పరమేశ్వర నిశ్శ్వాసములు. వేదములు గురుశిష్య పరంపరగా వినిపింపబడుట వలన శ్రుతులనబడినవి. ఈశ్వర ప్రోక్తములు శ్రుతులు. ఋషిప్రోక్తములు స్మృతులు. వేదమంత్రములతో వ్యాఖ్యా నములను గలిపి మొత్తము వేదమే యను అపోహ ప్రచారమునకు రాగా, కాలక్రమమున వేదముల సత్యస్వరూపమే మఱుగుపడుదుస్థితి దాపురించెను. కాబట్టి వేదములననేవి? అవి ఎట్లు స్వతః ప్రమా ణములు? అను విషయములను విస్పష్టముగ అవగత మొనరించు కొనుట అత్యంత మావశ్యకము.

ఈ విషయమును గూర్చి రాగద్వేషములకు లోనుగాక పరిశీలన చేసి పరిశోధనముగావించి; హేతుబద్ధముగ తర్కించి; సత్యమును నిర్ణయింప బ్రయత్నింతము. తన్మథనమున వెలువడిన సత్యమును నిర్భయముగ నిష్కామముగ బ్రకటింతము.

వేదముల నిజస్వరూపమును గూర్చి పెక్కుమంది మహర్షులు; పండితులు; పరిశోధనములు గావించిరి వాదోపవాదములొనర్చిరి. వారెల్లరు దమకు దోచిన రీతులలో నిర్ణయములను గావించిరి. అవియే సత్యములని విశ్వసించిరి. ఈవిషయములన్నిటిని మనదృక్పథమునకు దెచ్చుకొనవలెను. హేతువును అంతర్లీన మొనర్చుకొని; దివ్యముగ వెలుగొందెడి ఉద్దీపనాశక్తికి ఫలితములై — నికషోపలపుటొరపిడికి నిల్చునట్టి వాస్తవిక విషయములను మనము హృదయపూర్వకముగ నామోదింతము. అహేతుకములు; అసత్యములునగు వానిని నిరాతంకముగ నిరాకరింతము. అంతమాత్రమున ఆ మహనీయుల పెద్దరికమును కించపఱచుటగాని; అవహేళన మొనర్చుటగాని; మాభావము గానేరదని భావుకులు గ్రహింపనగును. దృఢసంకల్పముతో; నిశ్చలమైన శ్రద్ధాసక్తులతో యథాతథముగ సత్యమును నిరూపించుటయే మా ఆకాంక్ష. అట్లే, సహృదయులు సైతము మానిర్ణయములను సహేతుకముగ తర్కింపవచ్చును. లోపములున్న జూపెట్టవచ్చును. సత్య నిర్ణయమే గదా మన పరమ లక్ష్యము! సత్యమును అందఱము ఏకగ్రీవముగ ఆమోదించి కీర్తింతము ఏకముగ ననుభవించి ఆనందింతము.

ఋక్, యజుః, సామ — అథర్వణములను నామములచే వెలసిన నాల్గు వేదములను — క్రమముగ అగ్ని, వాయువు, సూర్యుడు, అంగీరసుడు. అను నలువురు పవిత్రాత్ములగు ఋషులలో భగవంతుడు ఆవిష్కరించెను. వేదములు నిర్వచించు, ఇంద్ర-మిత్ర-వరుణ-మాతరిశ్వ-సువర్ణాది నామములు భగవంతుని నానావిధ శక్తులను, గుణగణ

ములను సూచించు శబ్దములు మాత్రమే. భిన్ననామములతో బేర్కొన బడు నివి యన్నియును భగవంతుని ఒకే శక్తినుండి వెలువడిన భిన్న స్వరూపములే! భగవచ్ఛక్తి ఏకము; అది దివ్యము; భవ్యము. దాని స్వరూపమే ఓంకారము. దానినే సృష్టికర్తయగు పరమేశ్వరు డందుము.

"ఇంద్రం మిత్రం వరుణ మగ్నిమాహురథో దివ్యస్సుపర్ణో గరుత్మాన్! ఏకం సద్విప్రా బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వాన మాహుః।

—(ఋ. 1-22-164-46.)

వేదములలో జెప్పబడిన దేవతలలో; హెచ్చు తగ్గులు లేవు. ఒక్కొక్క దేవతానామ మొక్కొక్క శక్తిని నిర్దేశించును. ఒకే శక్తి భిన్నరూపములను దాల్చి భిన్ననామములతో ప్రకటమగుచుండుట జగద్విదితము. నేటి భౌతికశాస్త్రజ్ఞులును ఈ విషయమును గమనించి ఆమోదించుట ముదావహము. యాంత్రికశక్తి విద్యుచ్ఛక్తిగను శాబ్దిక శక్తి తేజశ్శక్తిగను పరివర్తనము బడయుచుండుననుట మనకందఱకు సువిదితమే! మన మహర్షులు ధారణాశక్తి నూతగాగొని, ఉగ్రతపస్సులు గావించి, నైష్ఠిక బ్రహ్మచర్యదీక్షాఫలితముగ వీర్యమును, దివ్యమగు ఓజశ్శక్తిగ నుద్దీపింపజేసికొని, వేదమంత్రములను అనుభూతికి దెచ్చుకొనిరి. అందులకే వారిని మంత్రద్రష్టలంటిమి. వేదనిర్ణయములలో సర్వమానవ సామాన్యములగు సంకుచిత భావములు రాగ ద్వేషయుక్తములై ప్రచలితములు గారాదు. విశాలభావముతో, సత్య దృష్టితో విషయములను పరిశీలించి సిద్ధాంత మొనర్చు కృషికి గడంగుటలెస్స. ఇట్టి సిద్ధాంతమును గావించుటకు మన మహర్షుల యనుభవములను

ఆధారముగ స్వీకరింతము. సంస్కృత సాహిత్యములోని విజ్ఞానమును జక్కగా గడించిన పాశ్చాత్యప్రముఖపండితులయు, వారి యనుయాయు లగు భారతీయ విద్వాంసులయు పరిశీలన పరిశోధనములను పరికింతము.

దయానంద మహర్షి, రామకృష్ణ పరమహంస — వివేకానంద స్వామి — రామతీర్థస్వామి — అరవిందయోగి — రమణమహర్షి మున్నగు ఆధునిక మహాత్ములయు, మహర్షులయు అంతఃకరణ జన్యములైన దివ్య దృక్పథములను, అనుభూతులను మన దృక్పథమునం దిడుకొందము. వేదములను ఎఱుకకు దెచ్చుకొనుటలో బాహ్యసాధన సంపత్తికే ప్రాకు లాడక, వేదములలోని ప్రమాణములనే స్వీకరింతము. వేదములనగా ఏవి - అను ప్రశ్నకు వేదములందే బలిష్ఠములైన నమాదానము లున్నవి. వీనికి ఉప బలముగ ఇతర ప్రమాణములను గూడ గ్రహింతము. ఇంతటి సాధనసంపత్తితో సునిశితముగ సమీక్షించి మన నిర్ణయము లను సుస్థిరము గావింతము.

"యస్మాదృచో అపాతక్షన్ యజుర్యస్మా దపాకషన్।
సామాని యస్య లోమాన్యథర్వాంగిరసో ముఖమ్॥
స్కంభం తం బ్రూహి కతమస్విదేవ సః॥"—
—(అథర్వ. కాం. 10, ప్రహ 23, అమ. 4, మంత్రం 20.)

ఋగ్వేద మెవరిచే నిర్మింపబడినదో, యజుర్వేద మెవరిచే నిర్మింపబడి నదో, సామము లెవరి రోమములో తేజోవంతమైన అథర్వణవేద మెవరి ముఖమో వానినే 'స్కంభ' (భగవంతుడు) అని పిలువుము. అందఱి కంటె ఉత్తమోత్తము డాయనయే!

"కవిర్మనీషీ పరిభూః స్వయం భూర్ యాథాతథ్యతోఽర్థాన్।
వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః।"

—(యజు - అ. 40. మం. 8.)

స్వయంభువు, సర్వవ్యాపకుడు, శుద్ధుడు, సనాతనుడు, నిరాకారుడునగు పరమేశ్వరుడు సనాతనజీవులనెడు ప్రజల కళ్యాణార్థము యథాతథముగా వేదమూలమున సమస్తవిద్యల నుపదేశించుచున్నాడు. అన్నిటిని సృజించి భరించు భగవంతుడే ఈ కార్యమును గావించును.

"యస్మిన్ ఋచః సామ యజూగ్ంషి యస్మిన్ ప్రతిష్ఠితా రథనాభావివారాః। యస్మిం శ్చిత్తగ్ం సర్వమే తం ప్రజానాం। తన్మే మనః శివసంకల్పమస్తు"

—(యజు. మం. 5.)

పరమ విద్వాంసుడవగు ఓ పరమేశ్వరా! చక్రమధ్యమందు నడ్డయు నాకులు కూడియుండునట్లు ఏనా మనస్సునందు ఋగ్యజుస్సామాథర్వణములను వేదములు ప్రతిష్ఠితము లగుచుండునో, ఆ నామనస్సు అవిద్యను బోగొట్టుకొని సదా విద్యాప్రియత్వమును గల్గియుండుగాక!

"అగ్నేర్ ఋగ్వేదో వాయోర్యజుర్వేదః సూర్యాత్ సామవేదః"

—(శతపథ బ్రాహ్మణం 11-4-2-3.)

సృష్ట్యాదియందు భగవంతుడు — అగ్ని, వాయువు, ఆదిత్యుడు, అంగిరసుడు (అథర్వాంగిరసౌముఖం) - అను మహర్షుల పవిత్రాత్మలయందు ఒక్కొక్క వేదమును క్రమముగ ప్రకాశమొనర్చెను.

"యో వై బ్రహ్మాణం విదధాతి పూర్వం యోవై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై! త హ దేవమాత్మ బుద్ధి ప్రకాశం ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే!"

—(శ్వే. ఉ. అ. 6, మం. 18.)

ఏ భగవంతుడు సృష్టికాలములో బ్రహ్మను సృష్టించి వానికి అగ్న్యాది ఋషులద్వారా వేదములను పొందింపజేసెనో, ఏ భగవంతుడు స్వబుద్ధియందు ప్రకాశించునో; అట్టి భగవంతుని ముముక్షుడనగు నేను శరణు జొచ్చుచున్నాను.

"ఏవం సంకల్ప్య భగవాన్ సర్వవేదా ననుస్మరన్।
నాట్యవేదం తతశ్చక్రే చతుర్వేదాంగ సంభవమ్॥
జగ్రాహ పాఠ్యం ఋగ్వేదాత్ సామభ్యో గీత మేవచ!
యజుర్వేదా దభినయాన్ రసా నథర్వణాదపి।"

— (భరతముని "నాట్యశాస్త్రము")

ఇట్లు భగవంతుడు సంకల్పించుకొని, అన్ని వేదములను స్మరించి అనంతరము నాలుగు వేదముల నుండి నాట్యశాస్త్రమును రచించెను. ఋగ్వేదమునుండి పాఠ్యమును, సామవేదమునుండి గీతమును, యజుర్వేదమునుండి అభినయమును, అథర్వణవేదము నుండి రసములను గ్రహించెను.

"ఋగ్వేదం భదవోఽధ్యేమి యజుర్వేదం
సామవేద మధ్వరణం చేతి"

—(ఛందోగ్య ఉపనిషత్తు.)

"ఋగ్యజుస్సామాథర్వణాశ్చత్వారో వేదాః
సాంగా స్సశాఖాశ్చత్వారః పాదా భవన్తి"

—(తాపనీయోపనిషత్తు.)

పై ప్రమాణములు 'వేదములు నాలుగు. అవి భగవన్నిశ్వాసనములు, అని సహేతుకముగ సమంజసముగ స్పష్టమొనర్చుటలేదా! వేదములను పెక్కు పర్యాయ పదములతో బేర్కొనుచుండుటయు గలదు. దైవీవాక్కు, ఛందస్సు, బ్రహ్మ, సంహిత, శ్రుతి, మంత్రము, ఉక్థ-అను నామములు వేదమునకు గలవు.

"తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే।
చందాగ్ంసి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాదజాయత।"

—(ఋ-యజు-అథర్వ.)

"తస్మాద్యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామానిజజ్ఞిరే।
ఛందోహ జిజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాదజాయత।"

—(అథర్వ.)

వేదములందలి 'ఛందస్' శబ్దము నాలుగు వేదములకుగాని ఒక్కొక్క వేదమునకుగాని సమన్వయించును. మానవజీవన గమనమున ప్రవృత్తి నివృత్తి రూపకానుశాసనము జేయగల ప్రథితశక్తి నిగమ వర్గమునకు మాత్రమే కలదు.

అవి విశ్వాత్ముని మహామహిమను వేనోళ్ళ గానమొనరించెడి కలకంఠరవములు. విశ్వప్రగతికి పసిడి బాటల జూపగల పరిశుద్ధ తేజఃపుంజములు.

మానవుని నిత్య ధర్మ నియమవ్రత పాలనకు నిరంతరపరీక్షలు. లోకకళ్యాణ ప్రతిపాదకము, దివ్యాచరణ రూపకమునగు భవ్యకావ్యము పై సుఖంకర శుభంకర సమీక్షలు. ఇట్టి బలిష్ఠకారణములవల్లనే వేదములవట్ల భారతీయులు పరిపూర్ణ భక్తి శ్రద్ధలను ప్రకటింతురు. దైవ వాణిగ, సుస్థిర సుదృఢ విశ్వాసముతో భక్తిశ్రద్ధలు చూపుచుందురు. దీనికి ఎదురులేదు. 'సృష్ట్యారంభము నుండియు యుగయుగములుగ భగవంతుని' నిశ్వాసములుగ వెలువడిన దివ్యజ్ఞానమే వేదములు. అందువలన - అవి నిత్యసత్యములుగ నుద్దీపించుచుండును. వీనిని ఒక కాలమునకో ప్రాంతమునకో బంధింపజాలము. ఇవి దేశకాల నిమిత్తము లకు అతీతములు. సనాతనములు. సర్వమానవులకు జెందినవి అని విశ్వసించు భారతీయుల భావమునందాశ్చర్యముగాని, ప్రమాదముగాని యుండదు. ఇది సహజము. ఇందే ఆర్యుల ప్రత్యేక విశిష్టత సంధ్యా రాగమువలె నిత్యనూత్నముగ శోభిల్లుచుండును.

ఆధునిక కాలమున పాశ్చాత్యపండితులు పెక్కురు పవిత్రము లగు వేదములను గూర్చి విపులమగు కృషిని గావించిరి. నిశితమగు పరిశీలన, తీవ్రమైన పరిశోధనముల నొనర్చిరి. తమ బుద్ధి కందినంత వఱకు ఉచితరీతిని నిర్ణయములను సైతము కావించిరి. వీరిలో కొందఱు మహా మేధావులు గలరు. వీరి సాముదాయిక కృషిని గాంచినచో వీరి సామాన్యభావ మిది యని చెప్పవచ్చును. 'వేదములు కాలబద్ధములు. ఇవి మానవుని యనాగరక దశయందు రచింపబడిన గ్రంథములు, పంచభూతములను, చెట్టు పుట్టలను, నదీ పర్వతములను ఆరాధించు - అనాగరకుల పాటలే వేదములు. స్వర్గమును ఆకాంక్షించియో, ధన ధాన్య పశు సంపదలను వాంఛించియో, రోగ నిర్మూలనమును

గాంక్షించియో పెక్కుర దేవతల నారాధించువారి గ్రంథములే ఈ వేదములు. ఇట్టి స్థూలదృష్టితో పాశ్చాత్య పండితులు తమ నిర్ణయములను గావించిరని చెప్పవచ్చును. అంతియేకాదు. వీరిలో పెక్కురు వేదములందు యజ్ఞయాగాదులు గావించుటలను, ఊహాగానముల నల్లుటలను మాత్రమే కాంతుమనియు నుద్ఘాటించిరి.

ఇక, మన పండితులలో కొందరి వైఖరి పరిశీలింతము!

మంత్రములు, బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు మొత్తముకలసి వేదములని కొందఱందురు. మఱికొందరు మంత్ర బ్రాహ్మణములు మాత్రమే వేదములనియు, ఇంక కొందఱు ఉపనిషత్తులే వేదములనియు నందురు. ఇట్లు తమ తమ బుద్ధి వికాన విశేషాదుల బురస్కరించుకొని తమ కుచితమని తోచినరీతిగ నిర్ణయములను గావించిరి. ఇవియు పరస్పర వైరుద్ధ్యములను కలిగియే యున్నవి. అంతియే గాదు! పైనిపేర్కొన్న ప్రాక్పశ్చిమ పండితుల వ్యాఖ్యలకు - వాదములకు - నముచితములగు నాధారములను వేదములందెచ్చుటను గాంచలేము.

వేదములు నిత్యములు; సత్యములు; అపౌరుషేయములు; ప్రభు సమ్మితములు, అని భారతీయు లందఱును విశ్వసింతురు. "అవియేవి ?'' అను విషయమున మాత్రమే మనవారు భిన్న దృక్పథములం ప్రకటించిరి. అంతియేకాని వేదముల ఉనికిని గూర్చికాని, మహత్త్వమును గూర్చికాని మనవారిలో ఆశయవైవిధ్యములేదు.

మన పండితులలోను వాదోపవాదములు, తర్జన భర్జనలు, తీవ్ర రూపమును దాల్చిన సమయములును లేకపోలేదు. ఈ కారణముల

చేతనే పెక్కురు నిర్దుష్టములగు నిర్ణయములను గావింపజాలక, తికమకల పాలైరని చెప్పవచ్చును. ఇందువలన వేదములేవి? అను విషయమున చిక్కులకును భ్రాంతికిని లోనగు దుస్థితి మనకు తటస్థించెను. ఈ వేదముల విషయమయి నిర్దుష్టము, సుస్థిరము నగు నిర్ణయమును గావింపనిచో వానిని పరమప్రమాణములుగ, సత్యనిలయములుగ నంగీకరింపజాలని దుస్థితి ఘటిల్లును. మూలముననే దెబ్బ తగిలి, ముప్పు గలుగక తప్పదు. అవాంఛనీయమైన అట్టి స్థితి సముత్పన్న మగుట సర్వేశ్వర సంకల్పముననే విరుద్ధముగదా!

విషపరిణామముల దొలగించి, విద్యున్మాలికలమెరయించి, వెలుగుజల్లుల గురియింపగల శక్తి అవసరమగు నపుడెల్ల విశ్వమున వెలయుచునే యుండును. తద్రూపమున సువిమల వేదహృదయ సుందర స్వరూపసాక్షాత్కారము జిజ్ఞాసువులకు లభ్యపడుచునే యుండును. అట్లే మన యదృష్టమో యన్నట్లు నవీనకాలములో వేదముల యథార్థతను జూపెట్టిన మహర్షు లవతరింపక పోలేదు. పందొమ్మిదవ శతాబ్దమున వేదములనుగూర్చి సునిశితములగు విపుల పరిశోధనములను గావించిన మహాత్ములలో శ్రీదయానంద సరస్వతి ప్రముఖ పాత్రధారులు. ఈయన ఒక మహర్షి; సత్యనిష్ఠా ప్రతిష్ఠులు; సత్యదృక్పథగాములు; దివ్యజ్ఞాన సంపన్నులు. వీరు తాము గావించిన పరిశోధనములను గ్రంథరూపమున ప్రకటించిరి. తమ నిర్ణయములకు వేదములనే పరమ ప్రమాణములుగ జూపిరి. అందలి అంతఃప్రమాణములను సాక్షిభూతములుగ నొనర్చుకొనిరి.

'మంత్రములు - సంహితలు మాత్రమే వేదములు, అని బలిష్ఠ ములగు ప్రమాణములను, సుస్థిరములగు నిదర్శనములను జూపెట్టి ఋజుమార్గమున స్థిరనిర్ణయములను - సిద్ధాంతములను గావించిరి.

దయానందుడు యావజ్జీవితము కఠోరమైన బ్రహ్మచర్యవ్రత దీక్షతో ప్రవర్తించిన పవిత్రమూర్తి. ధీశక్తిసంపన్నులు. ఆర్షవిద్య నామూలాగ్రముగ ఆకళించుకొని జీర్ణించుకొన్న మహా విద్వాంసులు. బ్రహ్మానుభూతి సంపన్నులు, పండితులు, పామరులు, దేశీయులు, విదేశీయులు అను భేదమే లేక అందఱు వేదాధ్యయనము చేయవచ్చు నని ఎలుగెత్తిచాటిన మహోదాత్తచరిత్రుడు. ఎందఱెన్నివిధముల ఎదిరించినను సత్యమునే పలుకుచు, సత్యమునే అనుష్ఠించి, సత్యస్వరూ పమును గాంచిన మహర్షిసత్తములు. సంకుచితభావములు వీడి, స్వాభిమానమును మాని, విశాల దృక్పథముతో మన మీ మహర్షి నిర్ణ యములను పరిశీలింతము. ఆయన ఏ సత్య శిఖరాగ్రమునుండి తన నిర్ణయములను గావించెనో ఆ స్థాయి నుండియే మనమీ సిద్ధాంత ములను విలోకింతము. విపులదృష్టితో జర్చించి తర్కించి సత్యమును గుర్తించి తన్మార్గమే స్వీకరింతము. అందు పయనింతము. ఆయన నిర్ణయముల నీ క్రింది విధముగ విభజింపవచ్చును.

1. వేదాధ్యయన మొనర్చు వారిని వేద పాఠకులందురు. వేదపాఠకులు కంఠస్థమొనర్చునని సంహితలు మాత్రమే, బ్రాహ్మ ణములను కంఠస్థ మొనర్చువారు వేదపాఠకులు గారు.

2. ప్రణవనాదమును ఆధారశ్రుతిగ నేర్పరచుకొని - ఉదాత్త అనుదాత్త స్వరిత ప్రచయము లనెడి నాలుగు స్వరములతో వేదములను

మాత్రమే గానము జేయుదురు. బ్రాహ్మణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు అను వీనికి స్వరములు లేవు.

3. పద క్రమ జటా ఘనములు అను పాఠములతో మంత్రములను అధ్యయన మొనర్తురు. ఇవి సంహితలకు మాత్రమే కలవు. బ్రాహ్మణాది గ్రంథములకీ పాఠములులేవు.

4. బ్రాహ్మణములు వ్యాఖ్యాన గ్రంథములు బ్రహ్మవేదము. బ్రహ్మణ ఇదమ్ - బ్రాహ్మణమ్. మంత్రములకు మొదటనున్న పదములను ప్రతీకగ నిచ్చి, వ్యాఖ్యగావింపబడియుండుట బ్రాహ్మణములందు జూడనగును. కావున మంత్రములు - సంహితలు మాత్రమే వేదములు. ఇక, వ్యాఖ్యానములో; అవి ఎంత రమ్యముగ, ఆకర్షణీయముగ నున్నను మూలమంత్రములుమాత్రము గాజాలవు.

5. బ్రాహ్మణములకు 'వేదము' లను నామమెచ్చటను గాంచము. శతపథబ్రాహ్మణము — ఐతరేయ బ్రాహ్మణము అను నామములతో మాత్రమే బ్రాహ్మణములను బేర్కొందుము.

6. వేదములందెచ్చటను శతపథ, గోపథాది బ్రాహ్మణ గ్రంథవాచకపదములను గాంచము. కాని బ్రాహ్మణము లందన్నో 'వేదము' అను పదమును పలు తావులలో గాంతుము.

7. 'వేదేష' అను పదమునకు ఋక్, యజుః, సామ, అథర్వణ వేదములని మాత్రమే పతంజలి మహాభాష్యకారులు వ్యాఖ్యాన మొనర్చిరి.

8. 'బహులం ఛందసి' అను సూత్రము నందలి 'ఛందసి' పదమునకు పతంజలి మహర్షి సంహితల నుండియే ఉదాహరణము లను జూపెట్టెను. బ్రాహ్మణములనుండి ఒక్కయుదాహరణమునైనను జూపలేదు.

9. చరిత్రాత్మక స్త్రీపురుషుల నామములుగాని, చరిత్రకు సంబంధించిన గాథలుగాని వేదములందు లేవు. ఇక, బ్రాహ్మణము లందు ఐతిహాసిక గాథలు పెక్కులుగలవు. అంతేగాదు శతపథ బ్రాహ్మణమునకు యాజ్ఞవల్క్యుడు, ఐతరేయ బ్రాహ్మణమునకు మహీ దాసు ( ఐతరేయ ఋషి ) కర్తలని విస్పష్టముగ బేర్కొనబడెను.

10. సంహితలకు ప్రారంభమున, అధ్యాయాంతమున 'వేదము' అను పదము కనుపించును. కాని బ్రాహ్మణములకు అట్లు లేదు. కాబట్టి కాత్యాయనముని - తన 'అపస్తంభశ్రౌత సూత్రములు' అను గ్రంథములో 'మంత్ర బ్రాహ్మణయోర్వేద నామధేయమ్' (అ. 24 పా. సూ. 13) అని నిర్వచించుట ప్రమాదము; అశాస్త్రీయము. పైన జూపిన కారణములన్నియును సహేతుకములుగ, శాస్త్ర సమ్మత ములుగ, బలిష్ఠములుగ నుండి సంహితలు - మంత్రములు మాత్రమే వేదములు అని ధ్రువ పఱచుచున్నవి.

స్వామిదయానంద సరస్వతి పరమ ప్రమాణములతో జూపిన నిర్ణయములను, సాధించిన సిద్ధాంతములను దివ్యజ్ఞాన సంపన్నుడగు అరవిందయోగి, హృదయపూర్వకముగ ఆమోదించి, వానికి స్థిరముద్ర లను వైచెను. దివ్యదృష్టి సంపన్నుడు, మంత్రద్రష్టయైన ఋషీశ్వరుని

నిర్ణయములను, దివ్యదృష్టి సంపన్నుడు, స్థితప్రజ్ఞుడైన మహాయోగి ధ్రువపఱచెను. తపోనిష్ఠా గరిష్ఠులు, సమాహిత చిత్తులునగు మహర్షు లకు ఆయా మంత్రార్థములు ప్రకాశములైనపుడు లోకకల్యాణమునకై వారు వానిని సుబోధకములుగ వివరించుచు, గ్రంథములను రచించిరి. ఈగ్రంథములకే బ్రాహ్మణములను నామముంచిరి. బ్రహ్మయన-వేదము. దాని వ్యాఖ్యానమే బ్రాహ్మణము. 'ఇత్యపి నిగమో భవతి-ఇతి బ్రాహ్మణమ్ (యాస్కుని నిరుక్త. అ. 5; ఖం. 3, 4.) ఇది వేదము; ఇది బ్రాహ్మణము అని విభిన్నముగ నిర్వచించిరి. ఛందో బ్రాహ్మణాని చ తద్విషయాణి' ప్రాణిని అష్టాధ్యాయి.

—(4-2-2-66.)

చందస్సు వేఱు, బ్రాహ్మణములు వేఱు - అని పాణిని వాని విభేదమును జూపెను.

"చతుర్వేదవిద్భిర్బ్రాహ్మణైర్మహర్షిభిః ప్రోక్తానియాని వేద వ్యాఖ్యానాని తాని బ్రాహ్మణానీతి.

—(పతంజలి-5-1-1)

చతుర్వేదపారంగతులు, పండితులు, బ్రాహ్మణులునగు మహర్షు లచే జెప్పబడిన వేదవ్యాఖ్యానములే బ్రాహ్మణములు. తైత్తిరీయ సంహితయు నిట్లే నిర్వచించుచున్నది. బ్రాహ్మణం నామ కర్మణస్తన్మం త్రాణాం చ వ్యాఖ్యాన గ్రంథః.

—(తైత్తిరీయ సంహిత 1-5-1.)

బ్రాహ్మణము లన యజ్ఞయాగాది కర్మలను, వేద మంత్రము లను వ్యాఖ్యానించు గ్రంథములు.

పై విషయములను బట్టి పరిశీలింపగా వేద మంత్రములకు వ్యాఖ్యలు గావించిన గ్రంథములే బ్రాహ్మణములని తేట తెల్లముగ గన్పించుచున్నది గదా! కాబట్టి వేదము లన సంహితలే యని సుస్పష్ట మగుచున్నది. మంత్రములు - సంహితలు సనాతనములు. అవి సర్వ లోకములకు, సర్వమానవులకు, సర్వకాలములకు జెందిన నిత్య సత్య ములు. తపోధనులగు మహర్షులు సమాధి నిష్ఠులగు మహాయోగులు మంత్రములందుగల సత్యమును ప్రత్యక్షముగ గాంచి మంత్రద్రష్టలుగ వెలుగొందిరి. మంత్రములు - సంహితలు మాత్రమే వేదములు. బ్రాహ్మ ణములు, ఆరణ్యకములు, ఉపనిషత్తులు, వేదములుగావు. అవి వైదిక వాఙ్మయమునకు జెందినపవిత్ర గ్రంథములు. వేదమంత్రములందు గల సత్యమును నిర్వచించి నిరూపించు వ్యాఖ్యలు. వేదమంత్రములకు అనుగుణముగ జీవించి, అనుభూతి నందుకొన్న ఋషుల అనుభవము లను వివరించు మతగ్రంథములు. సంహితలే వేరములు. వీనినే శ్రుతు లని యందురు. ఋషిప్రోక్తగ్రంథములు స్మృతులు. శ్రుతిననుసరించి నంతవరకే స్మృతి ప్రమాణము. శ్రుతికి భిన్నముగ నున్నపుడు స్మృతిని నిరాకరించి శ్రుతిని పరమ ప్రమాణముగ నంగీకరింపవలెను. ఏలన; శ్రుతి - అపౌరుషేయము, సనాతనము, ప్రభుసమ్మితము, నిత్యసత్యము. అది స్వతః ప్రమాణము. స్మృతులు పరతః ప్రమాణములు; పౌరుషేయములు.

## వేదాధ్యయనము

లింగవిభేదముగాని, జాతి, మత, వర్ణవిభేదముగాని లేక సర్వ మానవులు వేదాధ్యయనము చేయవలెనని వేదములే శాసించుచున్నవి.

అవి మానవకల్యాణమును, విశ్వశాంతిని ప్రబోధించు నిత్యసత్యములు. కాబట్టి ప్రతిమానవుడు వానినధ్యయన మొనర్చ - అనుభూతిని పొంద నర్హుడని వేదములు సుశ్రావ్యముగ, ఆనంధదాయకముగ గాన మొనర్చు చున్నవి. ఋగ్వేదము కీర్తించు విరాట్పురుషుని వర్ణనము వింద ము.

"యత్ పురుషం వ్యదధుః కతిథా వ్యకల్పయన్।
ముఖం కిమస్య కౌబాహూ, కావూరూ, పాదావుచ్యేతే॥"

అతని ముఖమేది? బాహువులేవి? ఊరువులేవి? పాదము లేవి? అని దానిభావము.

"బ్రాహ్మణోఽస్యముఖమాసీత్,
బాహూ రాజన్యః కృతః।
ఊరూ తదస్యయద్ వైశ్యః
పద్భ్యాగ్ం శూద్రోఽజాయత॥"

అతని ముఖము బ్రాహ్మణుడు. బాహువులు క్షత్రియులు, ఊరువులు వైశ్యులు. పాదములు శూద్రులు—అయ్యెను. అజాయత=అయ్యెను; ఉండెను; పుట్టెను; అని నానార్థములు. పైన జూపిన మంత్రముల భావములు సరలములు. తేటతెల్లములు. కాని దురదృష్ట వశమున పై మంత్రములకు కొందఱు పండితులు 'బ్రాహ్మణులు ముఖమునుండి, క్షత్రియులు బాహువులనుండి, వైశ్యులు తొడలనుండి, శూద్రులు పాదములనుండి పుట్టిరి. అని సంకుచిత వ్యాఖ్యానమునుజేసి అపార్థ మును గల్పించు కృత్రిమ భావములను లేవనెత్తిరి. ఇట్టి భావములకు గాని, వ్యాఖ్యలకు గాని పురుషసూక్తములో ఈషణ్మాత్రమైనను ఆధా రము గన్పించదు. పురుషసూక్తములోని ప్రశ్నయందే ఇట్టి భావమునకు

లవలేశమైనను తావులేదు. విరాట్పురుషుని ముఖమేది? బాహువులేవి? ఊరువులేవి? పాదములేవి? అని గదా పురుషసూక్తము ప్రశ్నించినది? ఎటనుండి ఎవరు జన్మించిరి? అని ప్రశ్నింపనే లేదు గదా! అగుచో వారు జన్మించిరి, వీరు జన్మించిరి అను వ్యాఖ్యకు ఆ మంత్రమున ఆధారమును కాంచముగదా! విరాణ్మూర్తియొక్క బ్రహ్మాండ స్వరూప వర్ణనమే యిందు సంగ్రథితాంశము — సత్యమిట్లుండ జనుల జన్మస్థానములు వర్గభేదము ననుసరించి యిందు నిర్వచింపబడినట్లు వ్యాఖ్యానించుకొని మానవులనడుమ నిమ్నోన్నత స్థితుల గల్పించుకొని వైరుధ్యముల బెంచుకొనుట వివేకలక్షణము గాజాలదు. కాబట్టి ఇట్టి వ్యాఖ్యానములు సందర్భశుద్ధినిగాని ఔచిత్యమునుగాని, భావనరలతను గాని జూపెట్టవు. పురుషసూక్తములోని ప్రశ్నలకు సమాధానము సైతమందేగలదు. ముఖము బ్రాహ్మణులు, బాహువులు క్షత్రియులు ఊరువులు వైశ్యులు, పాదములు శూద్రులు అయ్యెను. అని సమాధానమొసంగెను. ఇది విరాట్ పురుషుని ఆలంకారిక విపులరూపవర్ణనము. చాతుర్వర్ణ్యవ్యవస్థకు సూచకము.

"అజాయత" అను పదమునకు జన్మించెనను అర్థము చెప్పుకొనుట సమంజసము. అందువలన శూద్రులు పాదములనుండి జనించిరి - అని చెప్పుట భావ్యమని ఏలతలంపగూడ దని కొందఱు ప్రశ్నింపవచ్చును. వాదము కొఱకు దీని నామోదింతమన్నను తక్కిన వర్ణముల వారు - బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు, క్రమముగ ముఖము, బాహువులు, ఊరువులనుండి జన్మించిరని చెప్పలేదుగదా! ఒక్క శూద్రులు మాత్రమే పాదముల నుండి జన్మించినచో తక్కిన త్రివర్ణముల వారెటనుండి జన్మించిరి? విరాట్ పురుషుని వర్ణనమునందు పోలికలను మాత్రమే

చూడవలెనుగాని జన్మములమాట ఎత్తరాదు. బ్రాహ్మణులు జ్ఞానులనియు, క్షత్రియులు పౌరుషవంతులనియు, కృషి - వ్యాపారములను గావించి ధన ధాన్యముల నార్జించువారు వైశ్యులనియు, పారిశ్రామికులు శూద్రులనియు చెప్పుట సహజము, సమంజసము. ఇందు హెచ్చుతగ్గులకు, ఉచ్చనీచ ములకు తావులేదు. జన్మము చేతనే వర్ణములేర్పడునను భావమునకు అంతకన్నను స్థానము గన్పింపదు. 'మానవుని గుణకర్మముల నను సరించియే వర్ణములేర్పడినవి. జన్మముచే మాత్రము కాదు' అని భగవ ద్గీత విస్పష్టముగ వివరించుచునే యున్నది, "చాతుర్వర్ణ్యం మయాసృష్టం గుణకర్మ విభాగశః, మరియును 'జన్మనాజాయతే శూద్రః సంస్కారాత్ ద్విజ రుచ్యతే। వేదపాఠీ భవేత్ విప్రో బ్రహ్మజ్ఞానీచ బ్రాహ్మణః" (మనువు) జన్మముచే మానవులందఱును శూద్రులే; జన్మించిన పిదప తమతమ సంస్కారముల ఫలితముగ వర్ణములేర్పడునని మనువు ప్రబో ధించెను గదా! వంశపరంపరానుగతమైన హిందువుల ఆచారమును దీనిని బలపఱచుచున్నది. బ్రాహ్మణ బాలబాలికలు తదితర వర్ణముల వారి యింట భుజించినపుడు వారిని శూద్రతుల్యులుగ బేర్కొని అందు దోషములేదని నేటికిని బ్రాహ్మణులు చెప్పుచుండుటను మనము విందుము.

బ్రహ్మజ్ఞానిగ వెలుగొందు నేటి బ్రాహ్మణుడు రేపు పతితుడై శూద్రుడు కావచ్చును. నేడు శూద్రుడుగ నున్నవాడు దివ్యజ్ఞానమును బడసి రేపు బ్రాహణుడు కావచ్చును. ఇట్లే తక్కిన వర్గములవారు సైతము పరివర్తనమును పడయవచ్చును. దీనికి మన పూర్వమహర్షులే ప్రత్యక్షప్రమాణభూతులు. క్షత్రియుడగు విశ్వామిత్రుడు బ్రహ్మర్షియ య్యెను. పల్లెపడుచునకు జన్మించిన వ్యాసుడు బ్రాహ్మణుడయ్యెను.

మతంగ కన్యయగు అరుంధతిని వివాహమాడిన వసిష్ఠుడు బ్రహ్మర్షి యయ్యెను, ఇంతయేల! పురుషసూక్తమందలి మంత్రముల భావమువే గాంచుడు! ఒకే ఒక్క విరాట్ పురుషుని అవయవములుగ నాలుగు వర్ణములవారు జూపబడిరి. ఒకే దేహమునగల అవయవములకు హెచ్చుతగ్గుల నాపాదించుట సమంజసమా? ఏయొక్క యవయవమును హీనముగ భావింపరాదు గదా? ఒకే దేహమునందుగల అవయవములకు పరస్పర సంబంధ బాంధవ్యములు గలవు గదా; సన్నిహిత సంబంధము, సఖ్యము, సహకారము, సహజముగనే గలవు గదా! ఒక అవయవమునకు బాధగలిగిన దేహమునందుగల సర్వాంగములు అబాధననుభవింపక తప్పదు గదా! శరీరమందలి ప్రత్యవయవమునకు నొక ప్రత్యేక కార్యమును నిర్వహించు శక్తి గలదు. అందు దానికి ప్రాముఖ్యమును గలదు. భిన్నావయవములు గావించు కర్మములు భిన్నముగ నున్నను శరీరపోషణమునకు, సంరక్షణమునకు, సమష్టి కల్యాణమునకు అవి యన్నియు నావశ్యకములే గదా! ప్రతి యవయవము స్వధర్మమును నిర్వహించుచు, సర్వదేహమునకు సమష్టిగ కల్యాణమును చేకూర్చుచుండును. శరీరమునకు బలమును, ఆరోగ్యమును, సౌష్ఠవమును, అందించుచుండును.

అంతః కరణమును శోభాయమాన మొనర్చి, శ్రేయము, శాంతి, సుఖములను ప్రసాదించును. మానవ జీవిత నిర్వహణమున వ్యక్తి సమష్టుల కల్యాణము నందించుటకు వర్ణాశ్రమములు స్థాపింపబడినవి. వారివారి మానసికప్రవృత్తులను బట్టి జీవిత నిర్వహణార్థము కృషిని గావించుటకు సర్వసామాన్యముగ గావింపబడిన విభజనము ఇది.

మానవశరీరమును సాదృశ్యముగ నిడికొని, వ్యక్తికిని, సంఘమునకును శ్రేయమును చేకూర్చుటకై వ్యక్తుల మనఃప్రవృత్తులను బట్టి కావింపబడిన సహజ సరళ విధానమే ఆవిభాగము. మానవ దేహమునందుగల ప్రధాన విభాగములను వాని వాని స్వధర్మనిర్వహణమును చూపెట్టుటకు, బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులుగ విశాలదృష్టితో సంఘమును విభజించిరి. పరస్పరానురాగముతో, సహనముతో, సహకారంతో, ఆయావర్ణ ధర్మములను నిర్వహించుచు తమకును, సాటి మానవులకును సుఖమును, శాంతిని జేకూర్చువిధానమే ఈ విభజనము.
"ప్రియం మాకృణు దేవేష ప్రియం రాజసుమాకృణు ప్రియం సర్వస్య పశ్యత ఉతశూద్ర ఉతార్యే।"

—(అథర్వ కాం. 19. సూ. 62.)

విద్వాంసుల (బ్రాహ్మణుల) ప్రేమకు నన్ను పాత్రుని గావింపుము. క్షత్రియ, వైశ్య, శూద్రుల ప్రేమకు నన్ను పాత్రుని గావింపుము. సర్వజీవుల ప్రేమకును నన్ను పాత్రుని గావింపుము.
"రుచం నోదేహిబ్రాహ్మణేషు రుచం రాజసు నస్కృధి రుచం వైశ్యేషు శూద్రేషు మయిదేహి రుచారుచం.

—(యజు. అ. 18. మం. 48.)

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులందఱును పరస్పరము ప్రేమించునట్లు చేయుము. భగవన్! నన్ను ప్రేమతో జూడుము. సర్వావయవములు సుదృఢములై పరస్పర సహకారభావమున వర్తించుచు దేహికి సంతసమును గలిగించునట్లు సర్వవర్ణములవారు సౌభాగ్యపరిపూర్ణులై సానురాగమున జీవించుచు సాంఘిక కళ్యాణమునకు దోడ్పడవలెనని కదా యీ మంత్రార్థము.

మానవులనందరను సమానముగ భావించి సమదృష్టితో గాంచ వలెనని వేదములు కీర్తించుచున్నవి. ఇందువలననే మానవులందఱును ఒకే భగవంతునినుండి జన్మించిరని విరాట్ పురుషుని వర్ణనమునందు స్పష్టముగ జూపబడినది. "ఏకం సద్విప్రా బహుధావదన్తి" అను వేదమంత్రమందలి యుత్కృష్టభావము ఇదియే గదా! మానవులందఱును సమానులు. సమానార్హతలను గలిగి యుండవలెను. పరస్పరానురాగ బద్ధులుగ వర్ధిల్లవలెను.

ఈ వేదప్రబోధము సర్వతోముఖ వికాసాత్మకము గాదా! అగుచో వేదాధ్యయనమునకు అందఱు మానవులును అర్హులేయనుట తథ్యము. సహజము. ఈ పవిత్రభావమునే వేదము వేనోళ్ళ గీర్తించు చున్నది. చూడుడు!

"యథేమాం వాచం కల్యాణీ మావదాని జనేభ్యః।
బ్రహ్మరాజన్యాభ్యాం శూద్రాయ చార్యాయ।"

— (యజు.)

"యథా భర్గస్వతీం వాచమావదాని జనాం అను"

— (అథర్వ.)

ఎల్లరు వినుడు! వేను బ్రకటించు సత్యమును వాఱెఱుగక పోయినను వారు నాతోనే నివసింతురు.

— (ఋగ్. ౧౦–125–4.)

మావలెనె మీరును ఈ దివ్యసత్యమును ప్రతియొక్కరికిని ఎలుగెత్తిచాటుడు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు, స్వజనులకు, పరులకు, దీనులకు గూడ ఈ సత్యమును బ్రకటించుడు.

— (యజు. 26–2.)

"స్త్రీలు, శూద్రులు సర్వమానవులును వేదాధ్యయనమునకు సమానముగ యోగ్యులు; అర్హతను గలిగియున్నారు." అని ఈ వేద మంత్రములు స్పష్టపఱచుచున్నవి. ఇంకను! స్త్రీలవిషయమై ఏమి చెప్పెనో చూతము.

1. చోదయంతీ సూనృతానాం చేతంతీ సుమతీనాం యజ్ఞం దధే సరస్వతీ.

— (ఋ. 1 - 3 - 11)

సరస్వతీ = యోషా = స్త్రీ

— (శతపథబ్రాహ్మణం, 2-5-1-11)

విదుషీమణి యగు స్త్రీ మధురములు, సత్యములు అగు విషయములను ప్రయోగించుచు, బుద్ధిమంతులైన వారిని ప్రేరేపించుచు యజ్ఞమును నిర్వహించుచున్నది. మంత్రము నధ్యయన మొనర్పని వారికి యజ్ఞనిర్వహణాధికారములేదు గదా!

2. అధః పశ్యస్వ మోపరిసంతరాం పాదకౌ హరమాతే కశప్లకౌ దృశన్! స్త్రీః బ్రహ్మాబభూవిధా ॥

— (ఋగ్వేదము – 8-33)

నడచునపుడు క్రిందికి చూడుము. పైకి చూడవద్దు. పాదములను చక్కగా నుంచుము. నీ గుప్తావయవములను ప్రకట మొనర్పకుము. బ్రహ్మవగుటకు యోగ్యురాల వగుదువు.

3. సమంజంతు విశ్వే దేవాః – 'విద్వాంసులందఱును తెలిసి కొందురు గాక' అను ఈ మంత్రమును వివాహకాలమున వధూవరు లిరువురును పఠింపవలెను.

— (గోభిలగృహ్యసూత్రము.)

4. వేదమంత్రములకు ఘోషా, గోదా, విశ్వవారా, అపాల లోపాముద్ర మున్నగు వారు (ఋషులుగ నున్న స్త్రీలు), ఇంక నెందఱో నారీరత్నములు బ్రహ్మవాదినులుగ వెలుగొందిరి.

5. ద్వివిధాః స్త్రియః బ్రహ్మవాదిన్యః సద్యోవధ్వశ్చ। తత్ర బ్రహ్మవాదినీనాం ఉపనయనం అగ్నీంధనం వేదాధ్యయనం స్వగృహే భిక్షాచర్యా చ సద్యో వధూనాం తు ఉపసితే వివాహే కాలే కథంచిత్.

— (హారిత ధర్మసూత్రములు – అ. 21 మొ 20 – సూ 24.)

బ్రహ్మవాదినులు, వధువులు – అని స్త్రీలు రెండు తెఱగులుగా నుందురు. అందు బ్రహ్మవాదినులకు ఉపనయనము. అగ్నీంధనము, వేదాధ్యయనము, స్వగృహమున భిక్షను స్వీకరించుటలు విధులు. ఇక, వధువులు ఉపనయనమును గావించుకొని వివాహమాడవలెను.

6. నశూద్ర సమాస్త్రియః నహిశూద్ర యోనౌ బ్రాహ్మణ-క్షత్రియ-వైశ్యాః జాయన్తే తస్మాత్ ఛంద సా స్త్రియః సంస్కార్యాః॥

— (హారీత ఋషి.)

స్త్రీలు శూద్రసమానులు గారు. శూద్రయోనులందు బ్రాహ్మణ క్షత్రియ – వైశ్యులు జన్మించరు. కాబట్టి ఛందస్సులను (వేదములను) పఠింప యోగ్యురాండ్రు.

7. పురాకల్పే కుమారీణాం మౌఞ్జీబంధనమిష్యతే। అధ్యాపనం చ వేదానాం సావిత్రీవచనం తథా॥ — (యమస్మృతి.)

పురాకల్పమను గ్రంథమున బాలికలు ఉపనయనమును గావించుకొని వేదములను చదువుటకును, చదివించుటకును, గాయత్రీ మంత్రమును జపించుటకు అధికారమును, అర్హతను గలిగి యుండిరని యున్నది.

ఇట్లు స్త్రీ పురుషవిభేదము, వర్ణవిభేదము లేక సర్వమానవులును వేదాధ్యయనమునకు యోగ్యులని స్పష్టమగుచున్నది గదా! వైదిక పదముల అర్థము - భావము నెఱుంగుటకు నిఘంటువు గలదు. యాస్క మహర్షి నిరుక్తమును గలదు. ఇవి పరమప్రమాణములు. వీనిని మూలములుగ నిడుకొని మంత్రముల భావముల నెఱుంగుట సముచితము. వేదమంత్రములలోని ప్రతి పదము ధాతుజన్యము వానికి యౌగికార్థము సహజము. ఈ విధముగ నర్థముల నెఱుకకు దెచ్చుకొని వ్యాఖ్యలను గావించుట భావ్యము - సమంజసము. కాని కాలక్రమముగ మన పండితులు - సాంప్రదాయికులు యౌగికార్థములను జాఱవిడుచుచు రూఢ్యర్థములను మాత్రమే గ్రహించి వ్యాఖ్యలను గావించుటచే వేద మంత్రముల నిజభావములు మఱుగువడి అందలి వాస్తవిక విషయములను నిర్దుష్టముగ నెఱుంగజాలని దుస్థితి ఏర్పడెను.

ఋగ్వేదమునకు స్కంధస్వామి, - వేంకటమాధవులు వ్యాఖ్య లొనర్చిరి. యజుర్వేదమునకు మహీధరుడు, ఉవ్వటుడు వ్యాఖ్యలను వ్రాసిరి. నాలుగు వేదములకును సంపూర్ణముగ వ్యాఖ్యలను గావించిన మహాత్ములు సాయణాచార్యులు. ఈయన వేదములపై అపారమగు భక్తి విశ్వాసములను గలిగియుండిరి. మహామేధావి. వేదములు 'అపౌరుషేయముల'ని హృదయపూర్వకముగ విశ్వసించెను. ఇంతటి మహావిద్వాంసులైన సాయణాచార్యులు - భాష్యకారులు వేదమంత్రముల నిర్వచనమునకు బ్రాహ్మణముల నాధారముగ నిడుకొని తన వ్యాఖ్యలను గావించెను ఇది మన దురదృష్టము.

బ్రాహ్మణాని మంత్రార్థవివరణాని తత్ర తత్ర యజ్ఞోపయోగిని భవన్తీతి హేతోరేవసాయణః ప్రథమం బ్రాహ్మణం వ్యాఖ్యాయ తతః పరం తదనుసారేణ ఋచాం వ్యాఖ్యాన మారేభే.

"బ్రాహ్మణస్య మంత్ర వ్యాఖ్యానోప యోగిత్వాత్ ఆదౌ బ్రాహ్మణం ఆరణ్యకాండసహితం వ్యాఖ్యాతం। అథ తత్ర తత్ర బ్రాహ్మణోదాహరణేన మంత్రాత్మకః సంహితా గ్రంథో వ్యాఖ్యాతవ్యః॥" ఇతి.

యజ్ఞాది కర్మకాండలను ముచ్చటించు బ్రాహ్మణములను ఆధారములుగ స్వీకరించి తదనుసారము సాయణాచార్యులు వేదమంత్రములకు వ్యాఖ్యలొనర్చెను. బ్రాహ్మణముల నాధారముగ నిడుకొని మూలములగు మంత్రములకు వ్యాఖ్య లొనర్చిరి. ఇట్లు వేదముల పరమప్రమాణముపై అనుకొనకయే ఆఘాత మొనర్చెను. 'వేదములు అపౌరుషేయములు, ప్రభు సమ్మితములు' అని హృదయపూర్వకముగ విశ్వసించి ఆమోదించిన సాయణాచార్యులు ఏలకో వానిని బ్రాహ్మణముల పర మొనర్చి తలవని తలంపుగ వేదౌన్నత్యమును కొంతగ కుంటుపఱచెను.

'అతో దీవ్యతే ఇతి దేవః మంత్రేణ ద్యోత్యతే ఇత్యర్థః' సాయణులు.

మంత్రములనుండి తెలియునట్టిదియే వేదము.

సాయణాచార్యుల వ్యాఖ్యలను దృష్టినిడుకొనియే ఆవల పెక్కురు మన పండితులు, మాక్సుముల్లర్ మున్నగు పాశ్చాత్య ప్రముఖ

పండితులు వేదమంత్రములకు అనువాదములను గావించిరి; వ్యాఖ్యలను వ్రాసిరి. అందువలన వేదముల నిజ స్వరూపము కొంతవరకు మఱుగుపడుటయు తటస్థించెను. ఇక, మీమాంసకులో! కర్మల యందు మంత్రములను వినియోగించి వానిని కర్మ ప్రతిపాదకములుగనే భావించిరి. విధివాక్యముల నన్నింటిని బ్రాహ్మణముల నుండియే స్వీకరించిరి. మంత్రములను వినియోగించిన తావులందును, వాని వాస్తవికార్థమును — భావమును గమనించినట్లుతోచదు. మీమాంసకుల ప్రధాన దృష్టి; ధర్మము. మంత్రములు మాత్రముకాదు, కావుననే పూర్వమీమాంస కర్తయగు జైమినిగాని, శబరస్వామి — కుమారిలభట్టు మున్నగు మహావిద్వాంసులుగాని సంహితలకు వ్యాఖ్యను వ్రాయలేదు. వీరు వేదమంత్రముల జోలికి బోకయే తాము ప్రాతిపదికలుగ స్వీకరించిన సూత్రములవే వేదమంత్రములని విశ్వసించినట్లు కన్పించుచున్నది. ఇంకొక విషయమును చూడుడు: యాజ్ఞవల్క్యునకు వైశంపాయనుడు గురువు. ఈ మహర్షి తన శిష్యునకు కృష్ణ యజుర్వేదమును బోధించెను. ఇందు బ్రాహ్మణముకూడ కలసియున్నది. కాబట్టి ఇది స్వచ్ఛమగు వేదముకాజాలదు. ఈకారణముచేతనే యాజ్ఞవల్క్యుడు తన తప్పిదము నెఱింగి తాను అధ్యయన మొనర్చిన కృష్ణ యజుర్వేదమును బయటికి వెడలగ్రక్కెను. తాను గావించిన తప్పిదమునకు ప్రాయశ్చిత్తముగ సూర్యభగవానుని గూర్చి సుదీర్ఘమగు తపస్సుగావించి వారికడ శుక్ల యజుర్వేదమును అధ్యయన మొనర్చెను. ఇందు మంత్రములు మాత్రమే కలవు. బ్రాహ్మణభాగము ఇందు కన్పింపదు. కాబట్టి శుక్ల యజుర్వేదమే పవిత్రమగు వేదము. యజుర్వేదమున (ఇఱికింపబడిన) కృష్ణ యజుర్వేదమును గూర్చి సాయణాచార్యుల అభిప్రాయమునే

గాంచుడు. 'కృష్ణాని మలినాని యజూంషి' (సాయణాచార్యులు.) కృష్ణ యజుర్వేదము మలిన పూరితము. అనగా కృష్ణ యజుర్వేదమున బ్రాహ్మణములు కలిసియున్నవి. కాబట్టి అది దోషపూరితము. వాస్తవ మగు వేదము కాదు.

కాలక్రమముగ ఆచార్యులు కొందఱు 'కర్మకాండకు చెందినవి బ్రాహ్మణములు; జ్ఞానకాండకు చెందినవి ఉపనిషత్తులు' అని భావించుటయు తటస్థించెను. ఈ రెండును కలసి వేదము అని చెప్పుటయు తటస్థించెను. ఇది ప్రమాదము కాదా!

వేదములు సర్వ విజ్ఞానమునకు నిలయములు; ప్రజ్ఞాన భాండాగారములు; ఆధిభౌతిక, ఆధిదైవిక, ఆధ్యాత్మిక మగు సర్వవిజ్ఞానము వేదములలో కలదు. ఇందు పర, అపర విద్యలు కలవు. వేదము పూర్ణవిజ్ఞానమును ప్రసాదించును. వేదములు ఒకే బ్రహ్మమును-భగవంతుని భిన్ననామములతో గీర్తించుచుండును. ఒకే దివ్యశక్తి బాహ్య ప్రకటనము కాగా నానా రూపములను దాల్చి వివిధనామములతో బేర్కొనబడుటను వేదములందు గాంతుము.

'హిరణ్య గర్భః సమవర్తతాగ్రే
భూతస్య జాతః పతిరేక ఆసీత్।
సదాధార పృథ్వీం ద్యాముతే మాం
కస్మై దేవాయ హవిషా విధేమ'

—(ఋ-10-121-1.)

ఎవడు స్వప్రకాశరూపుడో, ప్రకాశ మొసరించు సూర్యచంద్రాదులను ధరించువాడో, ఎవడు సర్వభూతములకు సృష్టికర్తయో,

అద్వితీయచేతన స్వరూపుడై యుండెనో, సమస్త జగదుత్పత్తికి పూర్వ ముండెనో ఆతడే ఈ భూమిని సూర్యాదులను ధరించుచున్నాడు. ఆ సుఖస్వరూపుడైన భగవంతుని శ్రద్ధాభక్తులతో మేము ఆరాధించు చున్నాము. ఒకే భగవంతుని భిన్ననామములతో మహర్షులు కీర్తించిరి. ఈ సత్యము నావిష్కరించుకొని ప్రకాశింపచేసినది సామాన్య ప్రజలు కాదు; అల్పజ్ఞులునుగాదు; అనాగరకు లంతకన్నను గాదు; అసత్యవాదులు గాని అహంభావ పూరితులునుగాని గారు; నియమ నిగ్రహములతో తదేకదీక్షతో దీర్ఘ కాలము తపస్సు గావించి, భగవంతుని ప్రత్యక్షముగ గాంచిన దివ్యతేజస్సంపన్నులగు ఋషి పుంగవులు. మంత్రములను ముఖాముఖిని గాంచి కీర్తించిన మంత్రద్రష్టలు. 'ఇంద్రుడు, యముడు, అగ్ని, వాయువు మున్నగు నామములతో వేదములు బ్రహ్మమును కీర్తించుచున్నవి' అని నొక్కిచెప్పిన మహర్షులు - మాక్సుముల్లర్, గ్రిఫిత్ రాత్ మున్నగు పాశ్చాత్య పండితులకుగాని, వారి యనుయాయులగు భారతీయ విద్వాంసులకు గాని ఏమాత్రము దీసిపోరు. అంతియెగాదు. తపోనిష్ఠయందును చిత్తైకాగ్రతయందు వారితో మన మహర్షుల నెంత మాత్రము బోల్పతగదు. మన మహర్షులు అల్పజ్ఞులుగను, అనాగర కులుగను జీవించిన దుర్బలులు గాదు. వారి నల్పులుగ దలంచుట మన యవివేకమును, అజ్ఞానమును, అల్పత్వమును బ్రదర్శించుటయే యగును. 'ఒక్కొక్క దేవతను తదితర దేవతల నామములతో, గుణములతో జూపుచు వానిని ఏకభగవానుని భిన్నదృశ్యములుగ, భిన్నరూపములుగ గీర్తించును' అను మహర్షుల అనుభూతిని - ఉద్దీవనమును నిరాకరించి 'వేదము లొక్కొక్క పర్యాయ మొక్కొక్క దేవతను గీర్తించుచు నున్నత సాయికి దెచ్చును. భిన్నదేవతలు భిన్నముగవే యుందురు.' అని

నిర్వచించి దానికి (Henotheism) అని నామకరణమును గావించిన మాక్సుముల్లర్ భావము సరిగాదు. నూతన నామము నొసంగుట వలన వాస్తవిక విషయము స్పష్టము గాజాలదు. సత్యమును మఱుగుపఱిచి, సామాన్య సరళ విజ్ఞానమును దూర మొనర్చి, ఏదో యొక నూతన నామమునో, వాదమునో చూపెట్టుట సత్యము కాజాలదు. ఇది సహృదయత్వమును ప్రదర్శింపదు. సద్రూపుడగు ఒకే భగవంతుని భిన్న నామములు, గుణములు గల దేవతలుగ గీర్తించుటయందే మన మహర్షుల యుదాత్తతగలదు. ఇందే వేదముల పరమార్థము భాసమాన మగు చుండును.

"ఏక ఏవాగ్నిర్ బహుధా సమిద్ధ
ఏకః సూర్యోవిశ్వం అనుభూతః।
ఏకైవోషాః సర్వం ఇదం విభాత్యేకం
వా ఇదం విబభూవ సర్వమ్॥"

—(ఋ. 8-52-2)

ఒకే అగ్నిభిన్నప్రాంతముల ప్రకాశించును. ఒకే సూర్యుడు అంతటను ప్రకాశించును. ఒకే ఉషస్సు సర్వత్ర ప్రకాశించును. ఉన్నదొక్కటే. సర్వము ఏకమే. "మహాభాగ్యాత్ దేవతాయా ఏక ఏవ ఆత్మా బహుధాస్తూయతే, ఏక స్యాత్మనోఽన్యే దేవాః ప్రత్యంగాని భవన్తి॥"

— యాస్కనిరుక్త (7-4-8-9)

ఒక మహత్తరశక్తి - బ్రహ్మము జగత్తునకు మూలముగ వెలుగొందు చున్నది. అది ఏకము; అద్వితీయము. ఈ ఏకదేవుడే బహురూపములుగ

స్తుతించిరి. "దేవతాగణము ఒకే దేవతయొక్క భిన్న భిన్న శక్తులకు ప్రతీకములు" అని యాస్క మహర్షి నిర్వచనము నిరూపించుచున్నది.

భగవంతుని దివ్యత్వము, ఆ భగవంతునితో మానవునకు గల సంబంధమును జూపెట్టు మనస్తత్త్వము, బ్రహ్మము, జీవుడు, ప్రకృతి అను మూడింటికిని గల అన్యోన్య సంబంధమును జూపెట్టు విశ్వతత్త్వమును యథాతథముగ మనమహర్షులు ప్రకటన మొనర్చిరి. ఈ విధముగ భగవంతుని దివ్యత్వమును, మానవుని మనస్తత్త్వమును, సృష్టి క్రమ విధానమును వేదములు విస్పష్టముగ వివరించుచున్నవి. ఈ సత్యము వెలుకకు దెచ్చుకొనియే "వేదములు ఆధ్యాత్మిక నిత్యసత్యమును, భౌతిక శాస్త్రముల నియమములను (Laws) ప్రకటించుచున్నవి.'' అని మహర్షి దయానంద సరస్వతి ధైర్యముగ, ధీరోదాత్తుడుగ, ప్రాజ్ఞుడుగ ఎలుగెత్తి లోకమునకు జాటెను. నేటి భౌతికశాస్త్రజ్ఞులు కొందఱు తమ శాస్త్రవిజ్ఞాన ఫలిత నియమములు (Laws) వేదమంత్రములు చూపెట్టు ప్రకృతి నియమములను, శాస్త్రసమ్మత విజ్ఞానమును అనుగమించు చున్నవని ఎఱుంగుట ముదావహము. వీరు మన మహర్షుల యడుగు జాడల పయనించుచుండుట ఎంతయు సంతోషదాయకము. శుభోదయము.

దయానంద సరస్వతి గావించిన వేదమంత్రముల నిర్వచనములను, ప్రకటించిన భావములను అరవిందయోగి సంపూర్ణముగ, హృదయపూర్వకముగ నామోదించెను. అంతేగాదు! ఇకముందు కను గొనబడు భౌతికశాస్త్ర నియమములన్నియు వేదములందు గలవు — అని అరవిందులు తన దివ్యదృష్టి ప్రభావముచే నిర్భయముగ ఎలుగెత్తి చాటెను.

సామాన్యముగ మనము పదములను ప్రయోగించునపుడు – అవి సూచించు వస్తువులను గూర్చియే ముచ్చటింతుము. ఆ పదముల ధాత్వర్థములను గూర్చి విచారింపము. సంహితలలోగల ప్రతిపదము ధాతువు నుండి యుత్పన్నమైనది. అది యౌగికము. కాబట్టి అందుగల ప్రతి పదము ఒక విశిష్టార్థమును గలిగి – అది సూచించు వస్తువును వివరించును. కారణముచేతనే యాస్కమహర్షి వేదమంత్రములందలి ప్రతిపదమును - ధాత్వర్థమును, అది సూచించు భావమును, ప్రకటించు వస్తువును (విషయము) గలిగియున్నదని స్పష్టముగ నిరూపించెను. ప్రతిపదమునకు, ఆధ్యాత్మికము, అధిదైవికము, ఆధిభౌతికము అను త్రివిధములగు అర్థములను విస్పష్టముగ జూపెట్టెను. సరలము, సహజమువైన యిట్టి భావమును నిరాకరింప బూనుట అతి సాహసము. ఇట్టి వాస్తవిక భావమును కాదని పరుల నాశ్రయింప బూనుట మన యల్పజ్ఞతవే ప్రకటించును. దయానంద మహర్షి యాస్కుని నిర్వచనమునే ప్రమాణముగ అంగీకరించుట ముదావహము. "వేదములు భగవంతు నావిష్కరించును. జీవాత్మ నావిష్కరించును. ప్రకృతి నావిష్కరించును'' అని దయానంద మహర్షి స్పష్టపరచెను. ఇది యంతయును ప్రజ్ఞానపూరిత దివ్యసత్యము గాదా! నేటి భౌతిక శాస్త్రజ్ఞులు ప్రకృతి నియమములను భౌతిక శక్తుల లక్షణమును ప్రకటించుచుండుట ప్రశంసనీయము. కాని, వీరిలో పెక్కురు భగవంతుని త్రోసిపుచ్చిరి; మహర్షుల అనుభూతిని నిరాకరించిరి. శ్రద్ధను తిరస్కరించిరి. విశ్వాసమును వెనుకకు నెట్టిరి. ఇవి యన్నియు 'ఊహాగానములు; మూఢవిశ్వాసములు'' అని యవహేళన మొనర్చిరి. కాని వీరిలో కొందఱు తమ తప్పిదమును గ్రహించిరి. అందువలన

పిరికి వివేకము వర్ధిల్లినది. ఇప్పుడిప్పుడే అనుభూతిసి ఆమోదించు స్థితికి వచ్చిరి. మన మహర్షుల వంకకు మరలి వారిని శరణు చొచ్చుచుండుట సంతసము. వారి భావ ప్రసార కుంభవృష్టిలో నుక్కిరిబిక్కిరియై యిప్పు డిప్పుడే భౌతికశాస్త్రజ్ఞులలో కొలదిమంది మన యోగిపుంగవుల పవిత్రాధ్యాత్మిక విచారధారకు ప్రణమిల్లుచున్నారు.

మన వేదసంస్కృతి శారద పాదారవిందములకడ నతమస్తకు లగుచున్నారు. ఇప్పటికైనను భౌతిక శాస్త్రజ్ఞులు మన మహర్షుల యడుగుజాడల పయనించు వివేకమును వికసింపజేసికొని తమకు శ్రేయస్సును, జగత్తునకు శాంతిని అందింతురు గాక। ఆ రాచబాటల పయనించి, సుఖింతురు గాక!

వేదమంత్రములు సృష్టి ( విశ్వ ) నియమములను, జీవిస్వభావమును, భగవంతుని స్వరూపమును విస్పష్టముగ జూపెట్టును. వేదమంత్రములకు యాస్కుని నిరుక్తము విస్పష్టమగు నిర్వచనము నొనర్పుచున్నది.

సర్వమానవజాతికి వేదమంత్రములు మూలములు. ఇవి మన జాతికి చైతన్యప్రదాయకములు. మన జాతి హృదయమున బాగుగ హత్తుకొని, ప్రకాశమును ప్రసరింపజేయుచున్న పట్టుకొమ్మలు. అజ్ఞేయముగ నణగియున్న వాననాజ్ఞానమును సక్రమముగ — హేతుబద్ధ మొనర్చి ఉద్దీపనము నందించు పరమ రసాయనములు. అఖండ దివ్యజ్యోతిని చూపెట్టు దివ్య దీపికలు. ఇందు సత్యము - శివము - సుందరము - సదా లీనములై యున్నవి. వేదములు సత్యమును ప్రబోధించును, ఆత్మలో అనంత సత్యము; దృష్టిలో దివ్యత్వపూరిత

సత్యము ; భావములో పవిత్ర సత్యము ; క్రియలో వినిర్మల సత్యము. ఇట్లు సర్వమును సత్యమయిమే. మనోవాక్కాయములకు త్రికరణశుద్ధి నందించుచు హృదయమును దివ్యముగ దీపింపజేయు నిత్యసత్యమును వేదములు అవిష్కరించుచున్నవి. అవి నిత్యజ్యోతులుగ వెలుంగుచున్నవి.

దయానంద సరస్వతి ఆధ్యాత్మిక తత్త్వమును అనుభూతికి దెచ్చుకొన్న మహర్షి. తాము సత్యమును జీర్ణించుకొని 'సత్యార్థ ప్రకాశము' అను పవిత్ర గ్రంథమును సర్వమానవులకు నందించిన ఉత్తమ పురుషుడు. 'భావసంపదకు క్రియాదక్షతను జోడించి, మానవుడవుగానే గాక దివ్యుడవుగను, ప్రకృతి విజేతవుగానే గాక భగవంతుని సేవకుడవుగను వెలుగొందుము' అని తన జీవితసారమును – దివ్యరసాయనమును ధైర్యముగ ప్రచార ప్రబోధములకు దెచ్చిన మహాయోగి. "అసమాన ప్రజ్ఞ, నిరంతరము కర్మల నాచరించుచు విశ్రాంతి నెఱుంగని సహనశక్తి, ఉద్దీపనమును దీపించు ఉత్సాహము, ఆకర్షవంతమగు మూర్తిత్వము జాజ్వల్యమానమగు అఖండ ఆధ్యాత్మిక తేజస్సు—ఇట్టి పవిత్ర సాధన సంపత్తి మాత్రమే ఆదర్శమును, సుస్థిరమగు రూపమునకు దెచ్చి అనుభవవంత మొనర్చును" అని వేదములందు బీజరూపములుగ – మంత్రములుగ నున్న సత్యములను సర్వమానవులకు సరలముగ జూపెట్టి సర్వజ్ఞుడుగ వెలుగొందిన మహాత్ముడు దయానందుడు, మాలిన్యముచే మఱుగుపడియున్న వేదములకు బాహ్యముగ గన్పించెటి దుమ్మును దులిపివైచి నిజస్వరూపమును, తేజమును, యథాతథముగ జూపెట్టిన యోగింపుంగవులు దయానందస్వామి. గుప్తముగ దాచబడియున్న వేద

ములను వెలికిదీసి, సర్వమానవులకును సమముగ పంచిపెట్టిన పవిత్ర హృదయులు దయానందులు. వేదములందుగల సత్యముల వెలుకకు దెచ్చుకొని, ఆకళించుకొని అనుభూతి నందుకొన్న ప్రాజ్ఞులు దయానందులు. వేద ధర్మమర్మము లీయన దృక్పథమున వెలుగుల జిలికినవి. విశ్వహితకాంక్షతో తత్ప్రకాశమును జగత్తుపై వెదజల్లి-శాశ్వతము; సదానంస్తుతి పాత్రమునగు సాహిత్యమును సృష్టిజేసి సదా స్మరణీయు డైనా డీ యోగికులతిలకుడు.

ఈ మహాత్ముడు తర్కశాస్త్రములో అంచెవేసినచేయి. ఆ కాలమున ఈ మహాత్మునకు ఎదురు పోటీగా నిలువ జాలిన యింకొకని గానలేము. తార్కికులలో తార్కికుడు. వాదోపవాదములం దీయనకు సాటి మఱియొకని జూపలేము. ఈ మహర్షి హేతువాద పటిమ అద్భుతము. ఈయన వాక్పాటవము అనమానము ఆకర్షణీయము. వేదములను గూర్చి ఈ మహాత్ముడు గావించిన దివ్య ప్రకటనములను ఆధ్యాత్మిక విభూతి సంపన్నుడగు అరవిందయోగి పరిపూర్ణముగ ఆమోదించెను. దయానంద భావాద్రి నుదయించిన అరవింద భాస్కరుడు వేద ధర్మకిరణ నికరముల నిక్కంపు వెలుగుతో విశ్వమును విభ్రమాశ్చర్య చకితము గావించెను. ఆ దివ్యకాంతికిరణములను బాహాటముగ ప్రకట మొనర్చెను.

భారతదేశము సనాతనము. ప్రజలు సనాతనజీవులు. వారి మతము సనాతనధర్మము. యుగయుగములుగ భారతీయులకు వేదములే మూల మంత్రములు. ఆయువు పట్టులు. వేదములు ఆధ్యాత్మిక తేజస్సునకు ఆలవాలములు. బ్రహ్మమును ప్రత్యక్ష మొనర్చి నిత్య

నందము ననుభవింపజేయు అమృతసాగరములు వేదములు. శారీర కముగ — మానసికముగ — ఆధ్యాత్మికముగ సౌష్ఠవమును సౌందర్యమును అందించు దివ్యరసాయనములు వేదములు. దేహికి తుష్టిని పుష్టిని గలిగించి ప్రేమమయము - త్యాగమయము — సేవామయము — అగు పూర్ణ జీవితమును ప్రసాదించు పవిత్రమంత్రములు వేదములు. ఇహపరము లను — భౌతికాధ్యాత్మికములను సమీకరించి సమన్వయించి శాంతిని సుఖమును అందించు పరమ సాధనములు వేదములు. భగవంతుని అనుభూతికి దెచ్చుకొను పవిత్ర జీవిత నిర్వహణమునకు పరమపద సోపానములు వేదములు.

జన్మ పరమార్థము నవగాహన మొనరించుకొని — మనుగడను మాన్య మొనరించుకొనుటకు; మానవుడు పయనింపదగిన బంగారు బాటలను వేదములే తీర్చి దిద్దినవి.

మానవుల మధ్య అగాధములగు లోయలేర్పడకుండ సన్నిహిత త్వమును గల్గించి సమైక్యతను బోధించి సార్థకతను గడించుటకు సాధనములే వేదములు.

మన మాతృదేశము కర్మభూమియని, పుణ్యభూమియని, రత్న గర్భయని విశ్వవిఖ్యాతిని బడసినది. ఆర్యావర్తముగ వెలుగొందినది. సదాచారములకు సదనముగ విలసిల్లినది. ఇట్టి మన మాతృదేశమునకు అవతారపురుషులు — మహాత్ములు — ఋషులు — యోగులు — వీరులు — కడుపువంటగ పండిరి. ఈ దేశమునకు శక్తి, ఔన్నత్యము, సాధు త్వము, సహనము, పావిత్ర్యము సనాతనధర్మములు, దయా దాక్షిణ్య ములు, దాన ధర్మములు, సహనశీలములు, సహజ లక్షణములుగ

ఇంపు కాపురము చేయుచునే యున్నవి. కాని అపుడపుడు ఇవి అంధకారముచే నావరింపబడుటయు తటస్థించుచున్నది. అట్టితటి మనలను సంరక్షించునవి వేదములే! చీకటి నుండి వెలుగునకు నడక సాగింప నుంకించుట జీవి లక్షణము. అట్టితటి వేదమే శరణ్యము. సౌజన్యమును పెంపొందించి దౌర్జన్యము నంత మొందింప యత్నించుట మానవధర్మము. అందు కనువైన ఆత్మబలమును ప్రసాదించునది వేదమే.

తామసమును రాజసమును విస్మరించి సాత్త్వికమును ప్రేమించుట మనుష్యధ్యేయము. తదనుగుణమైన మహోపదేశమును వేదమే ప్రసాదించును

సుస్థిరమైన సాంఘికవ్యవస్థను సుప్రతిష్ఠితముగావింప సామాజికుడు తహతహ జెందుట సామాన్యధర్మము. తదుచితమగు భావన రేకెత్తింపగలది వేదమే.

మానవుని జీవనవీణానాదమే వేదము మానవాభ్యుదయకాంతి ప్రసాదమే వేదము.

వీణె మెట్లు సరిజేయుటలో లోపము లుప్పతిల్లవచ్చును. సరిదిద్దుకొనిన సునాద మావిర్భవించును.

కాంతిప్రసారమున మసక లేర్పడవచ్చును. వానిని చక్కగ దుడిచివైచిన మేలి మెఱుగులు తళుకులీనును.

అది వీణెయందలి లోపము గానేరదు. అది కాంతియందలి వక్రత యనిపించుకొననేరదు. సాధకుల వివేక లోపము. సంపాదకు జ్ఞానలోపము.

ఎల్లకాలమట్లుండదు. "కాలోహ్యయం నిరవధిః విపులా చ పృథ్వీ."

— (భవభూతి.)

మరల మహనీయు లుద్భవించి మంజులనాదముల బలికింతురు. మధురరుచుల బ్రసాదింతురు

మూలకందమగు వేదామృతము మాత్రము సర్వధా సకల జనానంద సంధాయకము. నిఖిలజగత్కళ్యాణ హేతుభూతము.

అట్టి వేదసుధను సునిశితదృష్టితో జుఱ్ఱుకొని భారతీయులు మాత్రమే భవసఫలతను మును ముందుగ గడింపగలిగిరి.


విశ్వవ్యాప్తముగ నీ మధురానుభూతులను వివిధ భంగిమలలో బంచగలిగిరి.

అట్టి వేదభూమికి వారసత్వమును సంపాదించుకొనెడి అదృష్టముగల భారతీయహృదయము; సర్వవేళల వేదమతప్రాశస్త్యమును బ్రతిధ్వనించుగాక —

వేదమాత భారతీయ మనోమందిరముల నధివసించి మంగళకరమగు పరిపాలన నెరపుగాక.

ఓమ్ శాంతిః శాంతిః శాంతిః

తి. తి. దేవస్థానముల ముద్రణాలయము, తిరుపతి. కా. 10,000



సత్యము సర్వోత్తమ ధర్మము

అకారణ కోపము అనర్థ హేతువు

తొందరపడి ఏ పని చేయరాదు

వివేకధైర్యములే విజయ హేతువులు

అతిగర్వము హానికరము

మహాత్ములను అవమానించుట అపచారము

సత్ప్రయత్నము వీడరాదు

వాగ్దోషము ప్రాణహాని కారణము

క్షమ సర్వకార్య సాధనము


భగవంతుడు భక్తివశ్యుడు

ఆత్మస్తుతి పతనకారణము

ఆడి తప్పరాదు

దేవుని దూషించుట మహాపచారము

42



తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రెస్, తిరుపతి. కా 10000

| Check List | | | |
|---|---|---|---|
| Book Number | MB01P151 | Date | 23/12/2021 |
| Front Cover | Yes | Back Cover | Yes |
| Blank Pages | NO | | |
| Missing Pages | NO | | |
| Prepared By | Ch. Ramya | Cutting By | Ch. Ramya |
| Scanned By | Amrutha | Pages | 53 |